హైదరాబాద్ వార్త



# కదలం... వదలం...

**-క్షణక్షణం... భయం ...భయం**
**-మూసి పరీవాహక ప్రాంత ప్రజల ఆందోళన**
**-ఏ క్షణంలో ఏం జరుగుతుందో తెలియని పరిస్థితిలో బాధితులు**
**-నివాసాలు కూలిస్తే బతికేది ఎలా అంటూ ఆవేదన**



మూసి పరివాహక ప్రాంతాన్ని సందర్శిస్తున్న ఈటల రాజేందర్

**ఎల్.బి.నగర్, సెప్టెంబర్ 28 ప్రభాతవార్త:** మూసి పరివాహ ప్రాంత ప్రజలు క్షణక్షణం భయం భయంతో బతుకుతున్నారు. ఏ క్షణాన ఏం జరుగుతుందోనని, నివాసాలు కూల్చివేస్తారో అనే భయంతో నివాసస్తులు నాలుగు రోజులుగా నరక యాతన అనుభవిస్తున్నారు. ఎల్బీనగర్ నియోజక వర్గం కొత్తపేట, చైతన్యపురి డివిజన్ పరిధిలోని మూసి పరివాహక ప్రాంతంలోని వినాయకనగర్, మారుతీనగర్, సత్యనగర్ తదితర ప్రజలకు కంటి కునుకు లేకుండా పోయింది. మూడు రోజులుగా జరుగుతున్న నివాసాల మార్కింగ్‌తో తమ నివాసాలను ఏ క్షణాన కూల్చివేస్తారని ఆవేదనతో ప్రజలు బిక్కుబిక్కుమంటున్నారు. గత మూడు రోజులుగా నివాసాలకు మూసి రివర్ ఫ్రెంట్, రెవెన్యూ అధికారులు పర్యటించి నివాసాలకు మార్కింగ్ వేస్తుండడంతో ఏ క్షణంలో ఏం జరుగుతుందో తెలియని అభద్రతాభావంతో నివాసస్తులు ఆందోళన చెందుతున్నారు. భారీ పోలీసు బందోబస్తు మధ్య అధికారులు మార్కింగ్ ప్రక్రియను కొనసాగిస్తుండగా ప్రజలు అడ్డుకునే ప్రయత్నం చేసిన ప్రయోజనం లేకపోయింది. శుక్రవారం మల్కాజ్గిరి ఎంపీ ఈటెల రాజేందర్ నేతృత్వంలో స్థానిక కార్పొరేటర్లు రాధాధీరజ్‌రెడ్డి, నాయికోటి పవన్‌కుమార్, రంగ నరసింహగుప్తా, బిజెపి నాయకులు, కార్యకర్తలు నివాసస్థులకు మద్దతుగా నిలిచి భరోసాను ఇచ్చారు. శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ఈటెల రాజేందర్ బాధితులకు మద్దతుగా నిలవడంతో మార్కింగ్ ప్రక్రియను అధికారులు నిలిపివేశారు. అధికారులు గట్టి హామీ ఇవ్వడంతో మార్కింగ్ ప్రక్రియ అధికారులు నిలిపివేశారు. అయితే స్థానికంగా వందలాదిమంది పోలీసు బలగాలు మోహరించడంతో ఏ క్షణాన ఏం జరుగుతుందొ తెలియని నిస్సహాయ స్థితిలో బాధితులు భయంతో బతుకుతున్నారు.

**ఏకమైన నివాసస్తులు...** నిర్మాణాలను కూల్చివేస్తారని అభద్రతాభావంతో ఉన్న నివాసస్తులు ఏకమయ్యారు. మూసి పక్కన ఉన్న నిర్మాణాలను కూల్చి వేయడానికి అధికారులు ఏ క్షణాన వస్తారో తెలియని పరిస్థితులలో ఉన్న నివాసస్థులు కూల్చివేతను అడ్డుకోవడానికి సిద్ధమయ్యారు. తమ నివాసాలను కాపాడాలని ముక్కోటి దేవతలను వేడుకుంటున్నారు. రెండు మూడు దశాబ్దాలుగా నివాసాలు ఏర్పాటు చేసుకొని నివాసం ఉంటున్నామని ప్రభుత్వపరమైన అన్ని రకాల అనుమతులు, పన్నులు చెల్లిస్తున్నామని అయినప్పటికీ ప్రభుత్వం కక్ష ధోరణితో వ్యవహరిస్తూ నిర్మాణాలను కూల్చివేసేందుకు ఎందుకు పంతం పడుతుందని బాధితులు ప్రశ్నిస్తున్నారు.

**.డబల్ బెడ్‌రూమ్ వద్దు...**

**పరిహారం వద్దు...**

తాము కష్టపడి నిర్మించుకున్న నిర్మాణాలను కూల్చివేస్తే సహించేది లేదని బాధితులు హెచ్చరిస్తున్నారు. మాకు ప్రభుత్వ పరమైన పరిహారం అక్కరలేదని, డబల్ బెడ్‌రూమ్ అవసరం లేదని నిక్కచ్చిగా చెప్తున్నారు. ప్రభుత్వ అధికారులు అనుమతులు ఇచ్చినప్పుడు లేని నిబంధన ఇప్పుడు ఎక్కడి నుంచి వచ్చిందని బాధితులు ప్రశ్నిస్తున్నారు. గూడు లేని వారికి గూడు కల్పించాల్సిన ప్రభుత్వం ఉన్న నిర్మాణాలను కూల్చి చేయడం ఎంతవరకు సబబు అని వారు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వేలాదిమంది ప్రజల కష్టాన్ని గుర్తించి నిర్మాణ కూల్చివేత ప్రక్రియను విరమించుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

**ఎంత దూరమైనా వెళ్తాం...**

మా నిర్మాణాలు కాపాడుకోవడానికి తాము ఎంత దూరమైనా వెళ్తామని బాధితులు అంటున్నారు. మాకు పరిహారం సానుభూతి అవసరం లేదని మా కష్టార్జితంతో నిర్మించుకున్న మా నివాసాలే మాకు కావాలని అంటున్నారు. తాము ఎవరి దయాదాక్షణ్యాల మీద బతకడం లేదని మా నివాసాలను మాకు వదిలేస్తే అదే మాకు పదివేలు అంటూ ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

**.గుండెలు బాధకుంటున్న బాధితులు....**

అన్ని అనుమతులతో నిర్మించుకున్న నివాసాలను కూల్చివేసే హక్కు ప్రభుత్వానికి ఎవరు ఇచ్చారని బాధితులు గుండెలు బాదుకుంటున్నారు. ఎన్ని భారీ వర్షాలు వచ్చినా ఈ ప్రాంతం ఎప్పుడు ముంపునకు గురి కాలేదని కబ్జాలు జరిగిన ప్రాంతాలను గుర్తించి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సూచించారు. దశాబ్దాలుగా మూసినది వర్షాకాలంలో పారుతుండడంతో మూసి నది వరద తాకిడికి వెడల్పు అయింది తప్ప ఎవరు కబ్జాలు చేయలేదన్నారు.



ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని కలిసిన బాధితులు



అధికారులను అడ్డుకుంటున్న బాధితులు

## మంచంపట్టిన నగరం !



**-ఉస్మానియా, గాంధీ,నిలోఫర్,ఫీవర్ ఆసుపత్రులకు పెరుగుతున్న కేసులు**
**-చిన్నారులపై సీజనల్ వ్యాధుల దాడి**
**-అన్ని జ్వరాలకు ఒకే రకమైన లక్షణాలు**
**-ఆసుపత్రులకు పరుగులు తీస్తున్న బాధితులు**
**-భయం వద్దు..జాగ్రత్తలే ముఖ్యమంటున్న వైద్యులు**
**-ఫాగింగ్ చేయని శివారు మున్సిపాలిటీలు**

**హైదరాబాద్, సెప్టెంబరు 28 ప్రభాతవార్త**

వాతావరణంలో మార్పుల కారణంగా నగరంలో సీజనల్ వ్యాధులు విజృంభించాయి. దగ్గు, జ్వరం, జలుబు, బాడీ ఫెయిన్‌తో నగరంలోని ప్రతి ఇంటిలో ఒకరు కనిపిస్తున్నారు. బాధితుల్లో ఎక్కువ శాతం చిన్నారులు ఉండటం ఆందోళన కలిగిస్తోంది. జ్వరాలన్నింటికీ లక్షణాలు ఒకేలా ఉండటంతో ఏది ఏ జ్వరమో తెలియక తికమకపడుతున్నారు. వాతావరణంలో మార్పుల కారణంగా నగరంలో డెంగ్యూ, చిగున్‌గున్యా, జలుబు, దగ్గు తదితర విష జ్వరాలు ప్రబలుతున్నాయి. దీంతో ఏది ఏ జ్వరమో తెలియక నగరవాసులు ఆసుపత్రులకు పరుగులు తీస్తున్నారు. నగరంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులకు వస్తున్న రోగుల్లో సీజనల్ వ్యాధుల బాధితులే ఎక్కువగా ఉంటున్నారు. ప్రస్తుతం వాతావరణంలో దోమలు కుట్టడం వల్ల డెంగ్యూ, చిగున్‌గున్యా తదితర వైరల్ ఫీవర్ వస్తుంటాయి. తాగునీటి వనరులు, ఆహార పదార్థాలు కలుషితం కావడం వల్ల టైఫాయిడ్, డయోరియా, న్యూమెనియా, డెంగీ వంటి వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయి. సీజనల్ వ్యాధులు ప్రబలడానికి ప్రధాన కారణం అపరిశుభ్రత, దోమలే. ప్రస్తుతం నగరంలో కురుస్తున్న వర్షాలు కురుస్తున్నందున బస్తీలు, కాలనీలలో పారిశ్య పరిస్థితులు అధ్వాన్నంగా తయారయ్యాయి. మురుగు కాల్వల్లో మురికినీరు నిల్వ పేరుకుపోయి వాటి నుంచి దోమల బెడత ఎక్కువవుతోంది. దోమలు కుట్టడం వల్ల డెంగ్యూ, చికున్‌గున్యా, మెదడువాపు వంటి వ్యాధులు ప్రబలే ప్రమాదముంది. మరోవైపు వర్షపు నీటితో తాగునీటి వనరులు కలుషితమవుతున్నాయి. నగరంలోని బస్తీలు, కాలనీలతోపాటు శివారు ప్రాంతాలు, శివారు మున్సిపాలిటీల్లో రాత్రి పూట పాగింగ్ చేయాలి.ముఖ్యంగా బోడుప్పల్, ఫిర్జాదిగూడ వంటి మున్సిపల్ కార్పొరేషన్‌లో పాగింగ్ చేయడం లేదు. ఎక్కడైన డెంగ్యూ కేసులు నమోదైతే ఆయా ప్రాంతాలకు వెళ్లి ఇంటింటా ఫీవర్ సర్వే నిర్వహించాలి.రోడ్లపైన బహిరంగ ప్రదేశాల్లో చెత్తాచెదారాలు పేరుకుపోకుండా చూడాలి. మురుగు కాల్వల్లో పూడికతీత చేపట్టాలి. దోమల లార్వాను తినే చేపలను (గుబూజియా చేపలు)నీరు నిల్వ ఉన్నచోట్ల వదలాలి. కానీ ఈ కార్య క్రమాలేవి సక్రమంగా జర గట్లేదు. సమస్య తీవ్రమైనప్పుడే అధికారులు హడావుడి చేస్తున్నారు. ఒకవైపు కరోనా మరోవైపు సీజనల్ వ్యాధులు వేధిస్తున్న ఈ తరుణంలోనైనా ప్రభుత్వ యంత్రాంగం స్పందించాలి. ఇంటిలో పల, ఆవరణలో ఎక్కడా వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. ఖాళీ కొబ్బరిబొండాలు, విరిగిపోయిన పెంకులు, పూలకుండీల్లో నీరు చేరకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఇంట్లో నిల్వ నీళ్లను ఎప్పటికప్పుడు పారబోసి పాత్రలను శుభ్రంగా కడిగి బోర్లించాలి. ఇంటిని, పరిసరాలను డెంగ్యూకు కారణమయ్యే ఏడిస్ ఈజిప్ట్ దోమ ఇంట్లో నిల్వ ఉన్న మంచినీళ్లలో గుడ్లు పెట్టి వెళ్తుంది. ఈ దోమల వ్యాప్తిని నిరోధించడానికి ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా భావించాలి. పాత టైర్లు, ఖాళీ కొబ్బరిబొండాల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. వంటింట్లో పాత్రలను ఎప్పుడూ పొడిగానే ఉంచాలి. వాటర్ కూలర్లలో నీటిని ఎప్పటికప్పుడు మారుస్తూ ఉండాలి. అలా మార్చడానికి వీలు కానప్పుడు కొన్ని చుక్కల కిరోసిన్ లేదా డీజిల్ గానీ ఆ నీటిలో కలపాలి. అనవసరమైన పాత్రలను పెరటి నుంచి ఆటకలపై నుంచి తీసివేయాలి. మురుగు కాల్వల్లో నీరు నిలిచిపోకుండా నిత్యం పారేలా చర్యలు చేపట్టాలి. నీరు నిల్వ ఉంటే ట్యాంకులపై మూతలు బిగుతుగా పెట్టాలి. సెప్టిక్ ట్యాంకులపై మూతవేసి ఉంచాలి. చెత్తాచెదారాలను ఎప్పటికప్పుడు పారవేయాలి. దోమల ఇంట్లోకి ప్రవేశించకుండా కిటికీలకు తలుపులకు దోమతెరలు ఏర్పాటు చేసుకోవాలి. మస్కిటో కాయిల్స్ లేదా బ్యాట్లను వాడవచ్చు.నిద్రించే చోట దోమతెరలు కుట్టుకోవాలి. శరీరాన్ని కప్పి ఉండేలా దుస్తులను ధరించాలి.

**ఈ జాగ్రత్తలు ముఖ్యం..**

**-జ్వరాల విషయంలో అశ్రద్ధ వద్దు. ఆఖరి నిమిషంలో వైద్యులను సంప్రదిస్తే కొన్నిసార్లు పరిస్థితి విషమంగా మారుతుంది.**

**-కాలనీలు, బస్తీల వద్ద పారిశుద్ధ్యం మెరుగుకు జాగ్రత్తలు తీసుకోవాలి. పిల్లలకు కాళ్లు, చేతులు కప్పి ఉంచేలా దుస్తులువేసి పంపాలి. మాస్క్‌తో పాటు శానిటైజర్ తప్పకుండా పిల్లల వద్ద ఉంచాలి.**

**-పిల్లలు లేదా పెద్దలకు జ్వరం వస్తే పారాసిట్మాల్ తప్ప.. వైద్యుల సూచనలు లేకుండా ఇతర మందులు వేయకూడదు. 24-48 గంటల్లో తగ్గనప్పుడు వెంటనే వైద్యులను సంప్రదించాలి.**

**-బాగా కాచి చల్లార్చిన నీళ్లతోపాటు వేడి ఆహారం ఇవ్వాలి. పిల్లలను బయట ఆహారానికి దూరంగా ఉంచాలి.**

**-101 డిగ్రీల కంటే జ్వరం తీవ్ర తలనొప్పి, కళ్లవెనుక నొప్పి, చలిజ్వరం, వాంతులు, ఉపిరి తీసుకోవడంలో ఇబ్బంది, రక్తంలో ఆక్సిజన్ తగ్గడం, బీపీ తగ్గిపోవడం, శరీర భాగాల నుంచి రక్తస్రావం కావడం వంటి లక్షణాలుంటే వెంటనే ఆసుపత్రికి తరలించాలి.**

## దేశ జిడిపి పెరగాలంటే రాష్ట్రాలు, ప్రజలు సహకరించాలి

**-ఐఎంఎఫ్ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ డాక్టర్ కె.వి సుబ్రమణియన్**



**హైదరాబాద్, సెప్టెంబరు 28,ప్రభాతవార్త:** ఇండియాలో జిడిపి రేటు పెరగాలంటే అందుకు రాష్ట్రాలు, ప్రజల సహకారం ఎంతో ముఖ్యమని ఇంటర్నేషనల్ మానిటరి ఫండ్ (ఐఎంఎఫ్) భారత ప్రభుత్వ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ డాక్టర్ కె.వి సుబ్రమణియన్ అన్నారు. ఈమేరకు శనివారం మన్స్ అనే నాన్‌పొలిటికల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో "భారత్ -ఏ జర్నీ ఫ్రమ్ డెవలపింగ్ నేషన్ టు ఎకానమిక్ సూపర్ పవర్ 2047 " అనేఅంశంపై హైదరాబాద్ హుస్సేన్‌సాగర్ సమీపంలోని మోక్ష్ బ్యాంకెట్స్ హాల్‌లో సెమినార్ నిర్వహించారు. దీనికి సుబ్రమణియన్ ముఖ్యఅతిధిగా హాజరై ప్రసంగించారు. ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ భారత దేశం 2047 వరకు 55 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ అయ్యేందుకు వీలుందన్నారు. ఇప్పుడు దేశ జిడిపి 7శాతం ఉందని కొంచెం కష్టపడితే 8వరకు తీసుసుకపోయే అవకాశం ఉందని తెలిపారు. అలాగే దేశంలో గత 10పదేళ్లలో జరిగిన అభివృద్ధి తీసుకువచ్చిన సంస్కరణలు వంటి అంశాలపై చర్చించారు. ఇతర దేశాలతో పోల్చితే డిజిటల్ పేమెంట్‌లో ముందు వరుసలో ఉన్నామని యుపిఐ స్కీంకు విశేషమైన ఆదరణ ఉందన్నారు. నిరుద్యోగ యువత వ్యాపారాల్లో రాణించాలంటే ఆర్థిక సహకారం అందించేందుకు అనేక అవకాశాలు ఉన్నాయని బ్యాంకులు సైతం వారికి సహకారం అందిస్తున్నాయన్నారు. ఈసందర్భంగా సమావేశానికి హాజరైన ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానాలు ఇచ్చారు. అనంతరం నిర్వాహాకులలతో కలిసి పాటపాడి అందరినీ అలరించారు.

ఈకార్యక్రమంలో మన్స్ సంస్థ ప్రతి నిధులు హైకోర్టు అడ్వకేట్ శ్రీపద ప్రభాకర్, కిరణ్ బిలిగిరి, సీనియర్ అడ్వకేట్లు, వివిధ రంగాలకు చెందిన ఆర్థిక ప్రతినిధులు పాల్గొన్నారు.

## డబుల్‌బెడ్‌రూం ఇళ్లకు మూసీ నిర్వాసితుల తరలింపు

**-ఆధార్‌కార్డు వెరిఫై చేసి పట్టా సర్టిఫికేట్, ఇంటి తాళం అందజేత**
**-స్వయం సహాయక బృందాల ద్వారా నిర్వాసితులకు రుణాలు అందిస్తాం**
**-జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**



వినాయకవీధి, శంకర్‌నగర్‌లో పర్యటిస్తున్న కలెక్టర్ అనుదీప్‌దురిశెట్టి, ఎమ్మెల్యే అహ్మద్‌బలాల తదితరులు

**హైదరాబాద్,సెప్టెంబరు 28,ప్రభాతవార్త:** మూసీ పరివాహక ప్రాంత ప్రజలకు పునరావాసం కల్పించే చర్యల్లో భాగంగా నిర్వాసితుల జీవనోపాధికి, పిల్లల చదువులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వ ఆదేశాలు మేరకు సమీపంలోని డబుల్‌బెడ్‌రూం భవన సముదాయంలోకి తరలించడం జరుగుతుందని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. శనివారం హిమాయత్‌నగర్ మండలంలోని వినాయకవీధి, శంకర్‌నగర్‌లను స్థానిక ఎమ్మెల్యే అహ్మద్ బలాలతో కలిసి కలెక్టర్ సందర్శించారు. వినాయకవీధి (రసూల్‌పురా), శంకర్‌నగర్ రివర్‌బెడ్‌లో 151 కుటుంబాలను గుర్తించి వినాయకవీధి, శంకర్‌నగర్ రెండు ప్రాంతాల నిర్వాసితులకు మలక్‌పేట్ నియోజకవర్గం సైదాబాద్ మండలంలోని పిల్లిగుడిసెలు, అలాగే జియాగూడలోని రెండుపడకల గృహాలకు తరలింపు ప్రక్రియ జరుగుతుందని, రెవెన్యూ, జిహెచ్‌ఎంసి , హౌసింగ్ శాఖలు వినాయకవీధి (రసూల్‌పురా)లోని వందకుటుంబాలను పిల్లి గుడిసెలు డబుల్‌బెడ్‌రూం సముదాయంలోనికి తరలించడం జరిగిదని జిల్లా కలెక్టర్ అన్నారు. మూసీ పరివాహక ప్రాంతంలో నివసిస్తున్న వారికి ప్రభుత్వ మార్గదర్శకాలకు లోబడి రెండు పడకల గదలు ఇండ్లను లాటరీ ద్వారా కేటాయించి ఇంటి పట్టాసర్టిఫికేట్, తాళం చెవులు అందజేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. నిర్వాసితులకు జీవనోపాధికి పిల్లల చదువులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. నిర్వాసితుల పిల్లల చదువుల కోసం సమీపంలోని ఎస్సీ,ఎస్టీ, బిసి మైనార్టీ గురుకులాల్లో ప్రవేశం కల్పించడం జరుగతుందన్నారు. అంతేకాకుండా వారికి వారికి స్వయం సహాయ సంఘాలల్లో రుణాలు అందించడం జరుగుతుందని అన్నారు. మూసీ పరివాహక ప్రాంత ప్రజలు ఎలాంటి అపోహాలు నమ్మొద్దని ,బస్తీవాసులు స్వచ్ఛందంగా డబుల్‌బెడ్‌రూం ఇళ్లకు వెళ్తున్నారని అన్నారు. మలక్‌పేట్ ఎమ్మెల్యే మహ్మద్ బలాల మాట్లాడుతూ మూసీ పరివాహక ప్రాంత వాసులు గత ఎన్నో ఏళ్లగా మూసీ నది వరదలతో చాలా ఇబ్బందులు పడే వారని అన్నారు. ప్రభుత్వ నిర్ణయంతో ఇక్కడి ప్రజలు స్వచ్ఛందంగా శాంతియుతంగా ప్రభుత్వం కేటాయించిన డబుల్‌బెడ్‌రూం గృహాలకు తరలించి వెళ్తున్నారని తెలిపారు. ఈకార్యక్రమంలో ఆర్డీవో కె.మహిపాల్‌రెడ్డి, తహసీల్దార్ సంధ్యారాణి, రెవెన్యూ ,జిహెచ్‌ఎంసి ,హౌసింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

## మెడికల్ షాప్ ముసుగులో స్టెరాయిడ్స్ సరఫరా

**- జిమ్‌కి వెళ్లే యువకులే టార్గెట్**
**- కార్వాన్, ఆసిఫ్‌నగర్‌లలో పెద్ద మొత్తంలో స్టెరాయిడ్స్ స్వాధీనం**

**మెహిదీపట్నం, సెప్టెంబర్ 28, ప్రభాతవార్త :** మెడికల్ షాప్ ముసుగులో గుట్టుచప్పుడు కాకుండా స్టెరాయిడ్స్ సప్లై చేస్తున్న ఓ ముఠాను డ్రగ్స్ అధికారులు శుక్రవారం అర్ధరాత్రి పట్టుకున్నారు. జిమ్‌కు వెళ్లే యువకులే టార్గెట్‌గా ఈ ముఠా విక్రయాలు చేస్తున్నట్లు విచారణలో గుర్తించారు. ఆసీఫ్‌నగర్, కార్వాన్‌లలో పెద్ద మొత్తంలో స్టెరాయిడ్స్, ట్యాబ్లెట్లు డ్రగ్ కంట్రోల్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఆసీఫ్‌నగర్,కార్వాన్ కేంద్రంగా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ముఠా స్టెరాయిడ్స్ సప్లై చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఆసీఫ్‌నగర్‌కి చెందిన అతిఫ్‌ఖాన్, కార్వాన్‌కు చెందిన అజిత్ సింగ్‌లను అదుపులోకి తీసుకొని డ్రగ్ కంట్రోల్ అధికారులు వెల్లడించారు. రంగారెడ్డి, నిజామాబాద్, నల్లగొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాకు ఈ స్టెరాయిడ్స్‌ను అతీఫ్‌ఖాన్, అజిత్‌సింగ్‌లు సప్లై చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. ఇదిలా ఉండగా..గత కొన్ని రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా డ్రగ్ కంట్రోల్ అధికారులు అనుమానిత మందుల షాపుల్లో తనిఖీలు నిర్వహిస్తున్నారు. వారి తనిఖీల్లో ఇప్పటికే నిషేధిత మందులు, ఇన్‌జెక్షన్‌లు భారీగా దొరికాయి. అయితే జిమ్‌కు వెళ్లే వాళ్లు, బాడీ బిల్డర్లనే లక్ష్యంగా చేసుకొని ఈ దందా సాగుతున్నట్లు తెలుస్తుంది. తక్కువ సమయంలో కండలు పెంచాలనే ఆలోచనతో కొందరు ఈ స్టెరాయిడ్స్ వాడి ప్రాణాలపైకి తెచ్చుకుంటున్నారు. ఇలాంటి స్టెరాయిడ్స్ వాడి కండలు పెంచాలనుకుంటే భవిష్యత్తులో చాలా ఆరోగ్య సమస్యలు ఎదుర్కొవాల్సి వస్తుందని అధికారులు వెల్లడించారు.

## జానీ మాస్టర్ కేసులో కొత్త ట్విస్ట్..

**పంజగుట్ట, సెప్టెంబర్ 28 ప్రభాతవార్త:**

తన భర్త అమాయకుడంటూ జానీ మాస్టర్ భార్య శనివారం ఫిలింఛాంబర్‌కు చేరుకుంది. జానీ మాస్టర్ భార్య సుమలత ఫిలింఛాంబర్‌కు చేరుకుని ఫిలిం చాంబర్ ఆఫ్ కామర్స్‌కు పలురకాల ఫిర్యాదులు చేయడం జరిగింది. నా భర్తను ట్రాప్ చేసి ప్రేమ పేరుతో వవేధింపులకు గురిచేయడం జరిగిందన్నారు.నేను ఆత్మహత్యాయత్నం చేసుకునేవరకు తమ కుటుంబాన్ని నానా రకాలుగా ఇబ్బందులకు గురిచేసిందని ఫిర్యాదులో పేర్కొన్నారు.నా భర్తను ఇంటికి రాకుండా అడ్డుకునేదని ఆమె ఆరోపించారు.

## మెడికల్ షాప్‌లో అగ్ని ప్రమాదం..



అగ్ని ప్రమాదంలో దగ్ధమైన ఆదిత్య మెడికల్ షాప్

**జీడిమెట్ల, సెప్టెంబర్ 28, ప్రభాతవార్త**

మేడ్చల్ జిల్లా సూరారం చౌరస్తాలోని ఆదిత్య మెడికల్ షాప్‌లో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. షాప్‌ముందు బ్యాట్రీ బైక్ చార్జింగ్ పెట్టడంతో వాహనం నుంచి ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. దీంతో షాపు అద్దాలు పగిలిపోయి లోపలికి మంటలు వ్యాపించాయి. పార్క్ చేసిన బైక్ మంటల్లో పూర్తిగా దగ్ధమైంది. స్థానికుల సమాచారంతో సంఘటన స్థలాని చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను అదుపే చేశారు. ఈ సంఘటనలో ఆస్థినష్టం జరిగినట్లు తెలుస్తుంది. ప్రధాన రహదారి కావడంతో మంటలు చెలరేగడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొన్నారు. ఎక్కడికక్కడ వాహనాలు నిలిచపోయాయి. షాప్‌లో మంటలఉు వ్యాపించడంతో గమనించిన షాప్ సిబ్బంది వెంటనే బయటకు పరుగులు పెట్టడంతో ప్రమాదం తప్పింది. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఎవరికి ఎటువంటి ప్రాణనష్టం జరగలేదని తెలిపారు. అయితే ఈ ఘటనలో ఆదిత్య మెడికల్ షాప్ మంటలు వ్యాపించడంతో పూర్తిగా దగ్ధం అయ్యింది.

## వీకెండ్ "హైడ్రా "

**-ఈవారం బుల్డోజర్లు ఎటువైపోనని జనాల్లో చర్చ**
**-మూసి పరీవాహక ప్రాంత ప్రజల్లో మొదలైన ఆందోళన**
**-ఇప్పటికే సర్వే చేసి పలు ఇండ్లపై ఆర్‌బి-ఎక్స్ ముద్ర**

**హైదరాబాద్, సెప్టెంబరు 28,ప్రభాతవార్త:** హైదరాబాద్‌లో చెరువులు, నాలాలు, పార్కుల సమీపంలో ఉండే ఇళ్ల యజమానులు హైడ్రా పేరు చెబితేనే వణికి పోతున్నారు. ఎప్పుడు ఏబుల్డోజర్ వచ్చి తమ ఇంటిని కూల్చేస్తుందోనని భయపడుతున్నారు. ఈనేపథ్యంలో గత ఆదివారం అమీన్‌పూర్, కూకట్‌పల్లిలో కూల్చివేతలు చేపట్టిన హైడ్రా ఈఆదివారం ఎక్కడ కూల్చివేతలు చేపడుతుందోనని చర్చ జరుగుతుంది. అయితే ఈఆదివారం మూసీపరివాహక ప్రాంతమైన మలక్‌పేట్, కొత్తపేట్, చైతన్యపురి, నాగోల్ ఏరియాల్లో మూసి ఆక్రమణలు కూల్చేందుకు సిద్దమైనట్లు సమాచారం. ఇప్పటికే ఆయా మూసి నదిపరివాహక ప్రాంతంలో ఇళ్లపై తాజాగా అధికారులు ఆర్‌బి ఎక్స్( రివర్‌బెడ్ ఎక్స్‌ట్రీమ్) గుర్తును సర్వే పేరుతో అనేక ఇళ్లపై వేశారు. ముందుస్తు సర్వే చేపట్టి.. ఎఫ్‌టిఎల్, బఫర్‌జోన్‌లో వచ్చే ఇళ్లకు ఇలా ఆర్‌బిఎక్స్ అని రాస్తున్నారని ఆతర్వాత బందోబస్తుతో బుల్డోజర్లతో వచ్చి..తమ ఇళ్లను కూల్చేస్తారని ఆయా ప్రజలు భయాందోళనకు గురవుతున్నారన్నారు. మూసీ నది పరివాహక ప్రాంతాల్లో రెండు మూడురోజులుగా కొందరు అధికారులు పర్యటిస్తున్నారు.

## ఘనంగా భగత్‌సింగ్ జయంతి వేడుకలు..



భగత్‌సింగ్‌కు నివాళులు అర్పిస్తున్న శేషుకుమారి

**సంజీవరెడ్డి నగర్, సెప్టెంబర్ 28, ప్రభాతవార్త**

అమీర్‌పేట డివిజన్‌లోని మైత్రివనం సత్యం థియేటర్ దగ్గర స్వాతంత్ర్య భారతావని అభివృద్ధి కోసం పాటుపడిన భగత్‌సింగ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అమీర్‌పేట మాజీ కార్పొరేటర్ నామన శేషు కుమారి, అమీర్‌పేట బిఆర్ఎస్ సీనియర్ నాయకులు కూతురు నరసింహా, నవ్‌సింగ్ జోగేందర్ సింగ్, చరణ్‌జిత్‌సింగ్, అజిత్‌సింగ్, కుశ్వంత్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## హైడ్రా పేరుతో ప్రజలను భయపెడితే సహించేది లేదు



మూసీ బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలేరు

**హైదరాబాద్, సెప్టెంబరు 28 ప్రభాతవార్త:**

పేద, మధ్యతరగతి ప్రజలు నిర్మించుకున్న నివాసాలపై హైడ్రా పేరుతో కా ంగ్రెస్ ప్రభుత్వం ప్రతాపం చూపడం సరికాదని, ప్రజల్లో భయం సృష్టిస్తే సహించేది లేదని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ హెచ్చరించారు. భూ కబ్జాదారులకు, ల్యాండ్ మాఫియాలకు, పైరవీకారులకు అండగా ఉంటూ పేదలకు ప్రభుత్వం నిలువ నీడ లేకుండా చేస్తున్నదని ఆయన ఆరోపించారు. శనివారం గోల్నాక డివిజన్‌లోని న్యూ తులసి రామ్‌నగర్‌లో మూసీ బాధితులతో కలిసి ఆయన మాట్లాడారు. ప్రభుత్వం మానవత్వం లేకుండా వ్యవహరిస్తున్నదని, పేదల ఇళ్ళు కూలగొట్టి వారి బ్రతుల్లో మట్టికొట్టే దుర్మార్గానికి ఒడిగట్టిందని ఆయన ఆరోపించారు. ఏ సమయంలోనైనా అవసరం ఉంటే ఫోన్ చేస్తే తాను అందుబాటులో ఉంటానని ఆయన నిర్వాసితులకు భరోసా ఇచ్చారు.

## కుక్కలకు విధిగా యాంటీ రేబిస్ టీకా వేయించాలి...

**పంజగుట్ట, సెప్టెంబర్ 28 (ప్రభాతవార్త):**

రేబిస్ ఫ్రీ తెలంగాణాగా రూపొందించడానికి కుక్కలకు విధిగా యాంటీ రేబిస్ టీకా వేయించాలని మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్ డైరక్టర్ వి.పి.గౌతమ్ అన్నారు. వరల్డ్ రేబిస్ ప్రివెన్షన్ డే సందర్భంగా బ్లూ క్రాస్ ఆఫ్ హైదరాబాద్,మిషన్ రేబిస్,జీహెచ్ఎంసీ సంయుక్త ఆధ్వర్యంలో కేబీఆర్ పార్క్ వద్ద ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ వ్యాధులకు మనుషులు టీకాలు తీసుకోవడం ఎంతముఖ్యమో జంతువులకు కూడా అంతే అవసరమన్నారు. ముఖ్యంగా కుక్కల్లో రేబిస్ ఉంటే అది కరిచినపుడు మనుషులకు కూడా వస్తుందన్నారు.అందువలన కుక్కలన్నింటికీ తప్పని సరిగా రేబిస్ టీకా వేయించాలన్నారు.జీహెచ్ఎంసీతో పాటుగా అన్ని మున్సిపాలిటీలలో ఆనిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్లున్నాయని, అన్ని జిల్లాలలో ఏబీసీ సెంటర్లు ఏర్పాటు చేశామని తెలిపారు.142 మునిసిపాలిటీలలో సుమారు 2.5 లక్షల కుక్కలుండగా ఇప్పటివరకు 92 వేల కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌లు చేయడం జరిగిందన్నారు.వీధి కుక్కల నియంత్రణకు, రేబిస్ నివారణకు రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు.చీఫ్ వెటర్నరీ అధికారి డాక్టర్ అబ్దుల్ వకీల్ మాట్లాడుతూరేబిస్ వ్యాధికి వ్యాక్సినేషన్ అన్ని ఆసుపత్రులలో అందుబాటులో ఉందన్నారు.నగరంలో కుక్కల జనన నియంత్రణ,స్టెరిలైజేషన్ ప్రక్రియను 80 శాతం పూర్తిచేసి దేశంలోని అన్ని మున్సిపాలిటీలకంటే ప్రథమ స్థానంలో ఉన్నామన్నారు. బ్లూ క్రాస్ సొసైటీ ప్రతినిధి అక్కినేని అమల మాట్లాడుతూ రేబిస్ వ్యాధి నివారణకు కుక్కలకు యాంటీరేబిస్ టీకా వేయడం, కుక్కల జనన నియంత్రణ చేయడం ఒక్కటే పరిష్కార మార్గమన్నారు. కార్యక్రమంలో పశువర్ధక శాఖ అధికారులు, స్థానిక అధికారులు పాల్గొన్నారు.

## మాదాపూర్ శ్రీచైతన్య సెంట్రల్ కిచెన్ నిర్వాహకులకు రూ.2లక్షల జరిమానా

**హైదరాబాద్, సెప్టెంబరు 28,ప్రభాతవార్త:**

మాదాపూర్‌లోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ పక్కనగల శ్రీచైతన్య అక్షర బాలికల జూనియర్ కళాశాల క్యాంపస్‌లో ఫుడ్‌పాయిజన్ కారణంగా విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారన్న ఫిర్యాదు మేరకు ఈనెల 27న జిహెచ్ఎంసి ఫుడ్‌సేఫ్టీ అధికారులు మాదాపూర్‌లోని శ్రీచైతన్య సెంట్రల్ కిచెన్‌లో తనిఖీ చేసినట్లు హెల్త్ అడిషనల్ కమిషనర్ పంకజ తెలిపారు. ఈతనిఖీలో పలు లోపాలు దృష్టికి వచ్చాయని ,సరైన పరిశుభ్రత ,పారిశుద్య నిర్వాహణ, ఆహార పదార్థాల నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదని ,ఆహార పదార్థాలకు సంబంధించిన ఐటమ్స్‌పై లేబుల్స్ లేకపోవడం, నిల్వ చేసిన ప్రదేశంలో బొద్దింకలు ఉండటం వటి పలు లోపాలు ఆహార భద్రత అధికారులు గమనించారని పేర్కొన్నారు. ఈమేరకు మాదాపూర్ అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ శ్రీచైతన్య సెంట్రల్ కిచన్ సంస్థకు రూ.2లక్షల జరిమానా విధించారని తెలిపారు. అదేవిధంగా ఫుడ్‌సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ యాక్ట్ 2006 నిభంధనల మేరకు తదిపరి చర్యలకు నిర్వాహకులకు సంజాయిషీ కోరుతూ షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు ఆమె తెలిపారు.

## హాస్యరస పాత్రలు పోషించడం సులువు కాదు



సినీ హాస్యనటుడు జెన్నీకి పురస్కారాన్ని ప్రదానం చేసిన దృశ్యం

**చిక్కడపల్లి, సెప్టెంబరు 28 ప్రభాతవార్త:** హాస్యరస పాత్రలు పోషించడం సులువు కాదని ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం పూర్వ చైర్మన్ పి.విజయబాబు అన్నారు. రాగరాగిణి సాహితీ, సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో దాదాసాహెబ్‌ఫాల్కే అవార్డుగ్రహీత, నటసమ్రాట్, పద్మభూషణ్ డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు శతజయంతి సందర్భంగా సిటీ, టీవీ, రేడియో, మైమ్, నటులు జెన్నీ ఆత్మీయ సత్కార కార్యక్రమం నిర్వాహక సంస్థ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.వి.రమణకుమారి, ఎం.వి.సుబ్బలక్ష్మి ఆధ్వర్యంలో జరిగింది. దక్షిణమధ్యరైల్వే పూర్వ జనరల్‌మేనేజర్ సి.రామకృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై పి.విజయకుమార్ పురస్కారాన్ని ప్రధానం చేసిన ప్రసంగించారు. అక్కినేని నాగేశ్వరరావు తన నటన ద్వారా తెనాలి రామకృష్ణ, మిస్సమ్మ చిత్రాలలో హాస్యరస పాత్రలు సమర్థవంగా పోషించారన్నారు. నాలుగువందల సినిమాల్లో వైవిధ్య పాత్రలలో నటించిన జెన్నీకి అక్కినేని పేరిట పురస్కారం ఇవ్వడం సముచితంగా ఉందన్నారు. జెన్నీ నటుడు మాత్రమే కాకుండా మైం ప్రక్రియలో ప్రముఖుడు అని అన్నారు. కార్యక్రమంలో తెలుగు భాషా ప్రచారకర్త వి.శైలజ తదితరులు పాల్గొన్నారు. 'మా హృదయపు కోవెలలో ఎఎన్ఆర్ సినీ గీత విభావరి' కార్యక్రమం ప్రముఖ గాయనీ ఎం.వి.రమణకుమారి స్వరసారధ్యంలో గాయనీ గాయకులు కృష్ణకుమారి, స్వర్ణ మంగళంపల్లి, ఉష మల్లాది, సుబ్రహ్మణ్యం, వినకర్,కమలాకర్,విజయకుమార్ అద్భుతంగా గానం చేశారు.

## ప్రభుత్వ అన్నమాచార్య కళార్చనతో ఉప్పొంగిన భక్తిపారవశ్యం



కళార్చన సంగీత గాత్రకచేరీలో ఒక దృశ్యం

**నాంపల్లి, సెప్టెంబరు 28 ప్రభాతవార్త :**

భారతీయ కళాజగత్తులో నృత్యం, సంగీత కళలు ఓ మహా యజ్ఞం.... ఒకే వేదికపై శాస్త్రీయ కూచిపూడి, భరతనాట్యం, పేరిణి నృత్యాలు.... మధురగళాల నుండి కలియుగ ప్రత్యక్షదైవం శ్రీవేంకటేశ్వరస్వామిని స్తుతిస్తూ జాలువారిన కీర్తనలు ఉప్పొంగిన భక్తిపారవశ్య సంగీత కచేరీలు జనరంజకంగా ప్రదర్శింపబడి ఆహుతులైన రసహృదయుల మనస్సుల్ని ఉల్లాసభరితంగా మంత్రముగ్ధులను చేశాయి. తెలంగాణ రాష్ట్ర అన్నమాచార్య ప్రభుత్వ మ్యూజిక్, డ్యాన్స్ కళాశాల ఆధ్వర్యంలో కళార్చన పేరిట నిర్వహించిన కార్యక్రమం ఇందుకు వేదిక అయ్యింది. ముందుగా కళాకారులు ప్రఖ్యాత సంగీత విద్వాంసురాలు ఎం.ఎస్. సుబ్బలక్ష్మికి ఘననివాళులర్పించి విశ్వవిఖ్యాతి చెందిన అన్నమాచార్య కీర్తనలను మృదుమధురంగా ఆలపించి సభికుల్లో భక్తిభావాలను ద్విగుణీకృతం కావించాయి. తెలుగునాట వెల్లివిరిసిన కూచిపూడి, భరతనాట్యం, ఆంధ్ర పేరిణి నాట్యాలను కళాకారులు వివిధ అంశాలను అద్భుత హావభావాలు, అభినయ కౌశలం, నృత్యవిన్యాలతో ప్రదర్శించి సభికులను అబ్బురపరిచాయి. అలాగే సంగీత వాద్య కచేరీలు సంగీతలోకంలో విహరింపజేశాయి. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కె.వరలక్ష్మి, మృదంగ అధ్యాపకుడు జయకుమార్ ఆచార్య, పేరిణి నాట్యాచార్యులు సునీలా, నాట్యగురువు కాంతారావు, హిందూస్థానీ గాత్రకళాకారిణి చింతామణి, కళాశాల సూపరింటెండెంట్ శ్రీనివాస్ తదితరులు పాల్గొని, చివరిగా ప్రిన్సిపాల్ వరలక్ష్మిని ఘనంగా సత్కరించారు.

## సేవాలాల్ మహారాజ్ జయంతిని సెలవు దినంగా ప్రకటించాలి : అజ్మీర్ సీతారం నాయక్

**నిజాంపేట్, సెప్టెంబర్ 28, ప్రభాతవార్త**

సేవలాల్ మహారాజ్ ఫిబ్రవరి 14 జయంతి సందర్భంగా పూజ భోగ్ బందర్ కార్యక్రమానికి ప్రత్యే నిధులు కేటాయించి, జయంతిని దినంగా ప్రకటించాలని మాజీ ఎంపీ మహబూబ్‌బాద్ బిజెపి ఎంపీ అభ్యర్థి అజ్మీర్ సీతారం నాయక్ ప్రభుత్వాన్ని కోరారు. శనివారం బంజార సేవా సంఘం కమిటీ ఆధ్వర్యంలో మాజీ ఎంపీ మహబూబ్‌బాద్ భారతీయ జనతా పార్టీ ఎంపీ అభ్యర్థి అజ్మీర్ సీతారం నాయక్ బంజారా ఆరాధ్యదైవం శ్రీశ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్, మాత జగదంబ మరమయ్యాడి గుడి నిర్మాణము, కమ్యూనిటీ హాల్ గురించి కమిటీ ఆధ్వర్యంలో చర్చించడం జరిగింది. రాష్ట్రంలో దేశంలోని ప్రతి తండాలోనూ బంజారా కమిటీహాల్‌లోను సేవలాల్ మహరాజ్ మాత జగదంబ మరియమ్మయాడి, బంజారా కమ్యూనిటీ హాల్ నిర్మాణం జరిగే విధంగా అటు కేంద్ర ప్రభుత్వంతో ఇటు రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి నిధులు సమకూర్చే విధంగా ప్రయత్నిస్తామన్నారు. ఐదువేల సంవత్సరాల బంజారా జాతులను ఇప్పుడు ఏకం కావాల్సిన అవసరం ఉందని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో నాలుగు కోటన్ల జనాభా కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయడం ద్వారా ఈరోజు కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో ఏర్పాటు అయిందని రాష్ట్ర ముఖ్యమంత్రి బంజార నాయకులను గుర్తించి ఎమ్మెల్యేలను సంక్షిప్త స్థానం, బంజారా కమ్యూనిటీని గౌరవించి అన్ని బంజారా సొసైటీ తండాలలో గుడి నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ బంజారా సేవా సంఘం అధ్యక్షులు, కార్పొరేటర్ బాలాజీ నాయక్, ప్రధాన కార్యదర్శి రాష్ట్ర సేవాలాల్ సేన ప్రధాన కార్యదర్శి రామచంద్ర నాయక్, ఉపాధ్యక్షులు పరమేష్ నాయక్, ముఖ్య సలహాదారులు హర్యానాయక్, బంజారా కవి జాతీయ సేవల సేన వ్యవస్థాపకులు డాక్టర్ ఎస్పి నాయక్, నిజాంపేట్ మున్సిప ల్ కార్పొరేషన్ బిజెపి ఒకటో డివిజన్ కార్పొరేటర్ విజయ లక్ష్మి, మున్సిపల్ కార్పొరేషన్ బిజెపి అధ్యక్షుఉల నరేంద్ర చౌదరి, బంజారా సేవా సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ గోపాల్ నాయక్, కార్యదర్శి పండు నాయక్, సంతోష్ నాయక్, ఆర్.రవి నాయక్, ఎం.రవి నాయక్, వినోద్ నాయక్, గిరిసింగ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## అక్కినేని జీవితం నటవిజ్ఞాన సర్వస్వం : చిన్నారెడ్డి



పురస్కారాలను ప్రదానం చేస్తున్న తెలంగాణ ప్రణాళిక సంఘం వైస్‌చైర్మన్ జె.చిన్నారెడ్డి

**చిక్కడపల్లి, సెప్టెంబరు 28 ప్రభాతవార్త:**

అక్కినేని నాగేశ్వరరావు జీవితం నటన రెండు విజ్ఞాన సర్వస్వం నేటి తరాలకు పాఠ్యగ్రంథం అని తెలంగాణ ప్రణాళిక సంఘం వైస్‌చైర్మన్ జె.చిన్నారెడ్డి అన్నారు. శనివారం రాత్రి సీల్‌వెల్ కార్పొరేషన్ అధినేత బండారు సుబ్బారావు-శృతిలయ ఫౌండేషన్, ఆదర్శ ఫౌండేషన్, ఆర్ఆర్.ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో పద్మభూషణ్ డాక్టర్ అక్కినేని శతజయంతి వేడుకల సందర్భంగా 'సీల్వెల్-శృతిలయ అక్కినేని మీడియా ఎక్సలెన్స్ అవార్డు'ల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వాహక సంస్థ అధ్యక్షుడు డాక్టర్ బొక్కా భీమ్‌రెడ్డి, వ్యవస్థాపక కార్యదర్శి ఆమని ఆధ్వర్యంలో చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో జరిగింది. పోలీసుహౌజింగ్ కార్పొరేషన్ పూర్వ చైర్మన్ కొల్లేటి దామోదర్‌గుప్త అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జె.చిన్నారెడ్డి పురస్కారాలను ప్రదానం చేసి ప్రసంగించారు. మీడియాలో వివిధ స్థాయిలలో పనిచేస్తున్న వారికి గురుతర బాధ్యత ఉంటుందని, మారుతున్న కాలానికి అనుగుణంగా సామాజిక మాధ్యమాల పోటీలో తట్టుకుని నిలబడటానికి వారికి దీక్ష, నిబద్ధత అవసరం అన్నారు. ఈ కార్యక్రమంలో వంశీ సంస్థల అధినేత డాక్టర్ వంశీ రామరాజు, కెవిఆర్ గ్రూప్ అధినేత కామసాని వెంకటరెడ్డి, ఆదర్శఫౌండేషన్ అధినేత కుసుమ భోగరాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీల్వెల్-శృతిలయ అక్కినేని జీవన సాఫల్య పురస్కారాలు, అక్కినేని మీడియా ఎక్సలెన్స్ అవార్డులు, సీల్వెల్-శృతిలయ అక్కినేని స్ఫూర్తి పురస్కారాలను అందించారు. వీటితో పాటు అక్కినేని సాంస్కృతిక సేవా పురస్కారాలను అందించారు. గాయనీ ఆమని స్వరసాంధ్యంలో 'ఆకాశ వీధిలో అందాల జాబిలి' పేరుతో అక్కినేని చిత్రగీతావళి కార్యక్రమంలో గాయనీ గాయకులు డి.ఎ. మిత్ర, సి.సుభాష్, శ్రీనివాస్, రాజన్, మణిబాబు, వెంకటేశ్వరరావు, అరుణ, రాధారాణి, అనూష, నవిత, రాము తదితరులు అద్భుతంగా గానం చేశారు.

## బహిర్భూమికి వెళ్లి వ్యక్తి మృతి..

**కెపిహెచ్‌బి కాలనీ, సెప్టెంబర్ 28, ప్రభాతవార్త**

బహిర్భూమికి కోసం వెళ్లిన ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతి చెందిన సంఘటన కెపిహెచ్‌బి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఖమ్మం జిల్లా, మధిర మండలం రయాపట్నం గ్రామానికి చెందిన కొండయ్య (35) అదే గ్రామానికి చెందిన సుగుణరాజ్ అతని స్నేహితుడైన అశోక్ ఓ దొంగతనం కేసులో జైలోన్ల ఉన్నాడు. బెయిలల్ షూరిటీ కోసం శుక్రవారం కూకట్‌పల్లికి కోర్టుకు వచ్చారు. సాయంత్రం వరకు ప్రయత్నించిన బెయిలల్ రాలేదు. దీంతో కొండయ్య వాటర్ బాటిల్ పట్టుకుని బహిర్భూమికి వెళ్తున్న అని సమీపంలో ఉన్న ములకతన్వ చెరువు కాలువ దగ్గరికి వెళ్లి ప్రమాదవశాత్తు అందులో పడి మృతి చెందాడు. ఎంతకీ తిరిగి రాకపోవడంతో స మీపంలో వెతికిన ఆచూకీ లభించలేదు. తిరిగి శనివారం వెతకగా కాలువలో పడి శవమై తేలడం గుర్తించారు. వెం టనే కెపిహెచ్‌బి పోలీసులకు సమాచారం అందజేయగా, వారు వెంటన సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీసి మృతుడి వివరాలు సేకరించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## ఆశ్రమంలో వృద్ధుడి మృతి

**సరూర్‌నగర్, సెప్టెంబర్ 28 ప్రభాతవార్త:**

ఓ కాలనీలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఓ వృద్ధుడిని గమనించిన పోలీసులు విచారించి ఓ స్వచ్ఛంద సంస్థ ఆశ్రమంలో చేర్పిస్తే అక్కడ అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ సంఘటన మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం అల్మాస్‌గూడ వినాయకహిల్స్ కాలనీలో ఈ నెల 23న అనుమానాస్పదంగా కనిపించిన అరవై సంవత్సరాల వయస్సు ఉన్న వృద్ధుడిని పెట్రోలింగ్ చేస్తున్న మీర్‌పేట్ పోలీసులు గమనించి విచారించారు. ఈ నేపథ్యంలోతన పేరు రమణ అని మాత్రమే చెప్పిన సదరు వృద్ధుడు పూర్తి వివరాలు మాత్రం చెప్పలేదు. దీంతో వృద్ధుడిని పోలీసులు అబ్దుల్లాపూర్‌మెట్‌లోని ఆలేటి ఆశ్రమంలో చేర్పించగా అస్వస్థతతో మృతి చెందాడు. దీంతో పోలీసులు వృద్ధుడిని మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీలో భద్రపరిచారు. ఈ నేపథ్యంలో వృద్ధుడిని గుర్తించిన వారు ఎవరైనా ఉంటే మీర్‌పేట్ పిఎస్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ కోరారు.

## మజీద్ ఆర్థిక సహాయం..

**జీడిమెట్ల, సెప్టెంబర్ 28, ప్రభాతవార్త**

దుండిగల్ మున్సిపల్ పరిధిలోని దుండిగల్ గ్రామంలోని 3వ వార్డులో ముస్లిం సోదరులు నూతనంగా నిర్మించిన మజీద్‌కు రూ. 50,000 ఆర్థిక సాయాన్ని శనివారం మండల సర్పంచ్‌ల ఫోరం, మాజీ అధ్యక్షుడు దుండిగల్ మాజీ సర్పంచ్ కావాలి గణేష్ అందిజేశారు. ఈ కార్యక్రమంలో దొంతి మహేష్ ముదిరాజ్, అమరం ముత్యం రెడ్డి, వపుల శ్రీనివాస్, సి.బాబు, పి.శివరాజ్, మైనార్టీ పెద్దలు సాదక్, జబ్బార్ అక్రం ఇర్ఫాన్‌లు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే కలిసిన మండల విద్యాధికారులు



ఎమ్మెల్యే వివేకానందతో నూతన విద్యాధికారులు

**పేట్ బషీరాబాద్, సెప్టెంబర్ 28, ప్రభాతవార్త**

పేట్ బషీరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని కుత్బుల్లాపూర్, దుండిగల్, బాచుపల్లి మండలాలకు చెందిన మండల విద్యాధికారులు జెమిని, కృష్ణ, రామకృష్ణలు ఎమ్మెల్యే కెపి వివేకానందను శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. నూతనంగా ఏర్పడిన దుండిగల్, బాచుపల్లి మండలాలకు ఎంఈఓ కార్యాలయాల భవనాలు నిర్మించాలని అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలలో పారిశుద్ధ్య నిర్వహణ, వాచ్‌మెన్‌ను ఏర్పాటుచేయాలని, వాచ్‌మెన్ రూమ్‌ల నిర్మాణం, మంచినీటి సదుపాయాల వంటి పలు సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన మండలాలలో మండల విద్యాధికారి కార్యాలయంతో పాటు అన్ని ప్రభుత్వ పాఠశాలలో వాచ్‌మెన్ రూము, మంచినీటి సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణకు కావలసిన అన్ని చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో మండల రిసోర్స్ పర్సన్ రమేష్, ఉపాధ్యాయ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కళాశాలలో ఘనంగా ముగిసిన క్రీడా ఉత్సవాలు..




**జీడిమెట్ల, సెప్టెంబర్ 28, ప్రభాతవార్త**

మర్రి లక్ష్మణ్‌రెడ్డి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్, ఫార్మసీ కళాశాలలో రెండు రోజులపాటు నిర్వహించిన క్రీడా పోటీలు శనివారంతో ముగిసాయి. ఈ క్రీడా ఉత్సవాలలో రాష్ట్రంలోని పలు విశ్వవిద్యాలయాల నుంచి జెఎన్‌టియుహెచ్ పరిధిలోని ప్రముఖ ఇంజనీరింగ్ కళాశాలల నుంచి వచ్చిన క్రీడాకారులు వివిధ రకాలైన క్రీడాద పోటీలలో పాల్గొన్నారు. ఇందులో ముఖ్యంగా క్రికెట్, వాలీబాల్, బాస్కెట్‌బాల్, కబడ్డీ, బ్యాట్‌మింటన్ ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి సైక్లింగ్ అథ్లెట్ వందన ముఖ్య అతిథిగా విచ్చేసి, కళాశాల చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డితో కలిసి విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ పి.శ్రీధర్, ప్రిన్సిపల్ డా.మురళీ ప్రసాద్, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డా.అర్ణబ్ మలిక్‌లు పాల్గొన్నారు.

## ఏడాది పాటు ఎ.బి.బర్ధన్ శత జయంతి ఉత్సవాలు



బర్ధన్ కటౌట్‌కు నివాళులు అర్పిస్తున్న సిపిఐ నేతలు ఇ.టి.నర్సింహ్మా, వి.ఎస్.బోస్ తదితరులు

**సైఫాబాద్, సెప్టెంబరు 28 ప్రభాతవార్త:**

భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) జాతీయ ప్రధాన కార్యదర్శి ఎ.బి.బర్ధన్ శత జయంతిని పురస్కరించుకుని హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో ఆయన కటౌట్‌ను హిమాయత్‌నగర్‌లోని సత్యనారాయణరెడ్డి భవనం వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి ఆనేక మంది సిపిఐ నాయకులు ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది. అనంతరం సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఇ.టి.నర్సింహ్మా, వి.ఎస్.బోస్ మాట్లాడుతూ బర్ధన్ తన జీవితమంతా ప్రజల కోసం త్యాగం చేశారని, విద్యార్థి ఉద్యమం నుంచి తన ప్రస్థానాన్ని ప్రారంభించి స్వతంత్రగా ఎమ్మెల్యేగా పోటి చేసి గెలిచి ప్రజలకు సేవలు అందించారని కొనియాడారు. ఆయన బహు భాషా కోవిదుడని, మేధావిగా పేరు, ప్రఖ్యాతలు పొందారని, పాలక వర్గాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై నిరంతరం రాజీలేని పోరాటాలు నిర్వహించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. బర్ధన్ చేస్తున్న పోరాటాలకు పాలక వర్గాలు సంవత్సరాలు తరబడి జైల్లో పెట్టారని, తీవ్రమైన నిర్బంధాల మధ్య అజ్ఞాతవాసం గడిపారని వారు తెలిపారు. బర్ధన్ పోరాటాల స్ఫూర్తితో నేడు కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక, రైతు వ్యతిరేక విధానాలపై బలమైన ప్రజా ఉద్యమాలను చేయాల్సిన బాధ్యత మనపైన ఉందని వారు స్పష్టం చేశారు. నేటి నుంచి ఏడాది పాటు బర్ధన్ శత జయంతి ఉత్సవాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎస్.ఛాయాదేవి, సీనియర్ నాయకులు పి.ప్రేమ్‌పావని, బి.వెంకటేశం, నగర నాయకులు స్టాలిన్, కమతం యాదగిరి, శంకర్‌నాయక్, నెర్లకంటి శ్రీకాంత్, ధర్మేంద్ర, బాబు,జంగయ్య పాల్గొన్నారు.

## 'కేంద్రప్రభుత్వ ఉద్యోగం పొందాలంటే హిందీ తప్పనిసరి

-ఉస్మానియా విశ్వవిద్యాలయం తులసీ భవన్ డైరెక్టర్ ఆచార్య ప్రదీప్‌కుమార్




కార్యక్రమంలో పాల్గొన్న ఓయు తులసీ భవన్ డైరెక్టర్ ఆచార్య ప్రదీప్‌కుమార్

**చిక్కడపల్లి, సెప్టెంబరు 28 ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వ ఉద్యోగం సంపాదించాలంటే హిందీ తప్పనిసరి అని ఉస్మానియా విశ్వవిద్యాలయం తులసీ భవన్ డైరెక్టర్ ఆచార్య ప్రదీప్ కుమార్ అన్నారు. శనివారం ఎబివి ప్రభుత్వ డిగ్రీ కళాశాల హిందీ దినోత్సవ కార్యక్రమం హిందీ లెక్చరర్ డాక్టర్ బికె.వందన ఆధ్వర్యంలో జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ నర్సయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆచార్య ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ హిందీబాష గురించి ప్రసంగించారు. ఆత్మీయ అతిథిగా డాక్టర్ భవానీ, డాక్టర్ నవీన, శ్రీదేవి, డాక్టర్ అనూరాధ, డాక్టర్ రాజేంద్రనాథ్, డాక్టర్ కృష్ణమూర్తి, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ మధు, డాక్టర్ గణేష్, కరుణాకర్, డాక్టర్ సురేఖ, సంధ్య తదితరులు పాల్గొన్నారు. నర్సయ్య మాట్లాడుతూ నిత్యం సమాజంలో కలిసి ఉండాలంటే హిందీ ఉపయోడపడుతుందన్నారు. డాక్టర్ హెచ్‌కె.వందన మాట్లాడుతూ హిందీ ప్రపంచంలో మూడో స్థానంలో ఉందన్నారు. సంస్కృతి కార్యక్రమాల్లో తెలుగు, హిందీ, ఇంగ్లీష్ భాషలలో విద్యార్థులు పాటలు పాడి అందరి నుంచి ప్రశంసలు అందుకున్నారు. వివిధ పోటీలలో విద్యార్థులకు సర్టిఫికేట్లు ప్రదానం చేశారు.

## రూ.21లక్షల వ్యయంతో సీవరేజ్ పైప్‌లైన్ పనులు త్వరలో పూర్తి

-కార్పొరేటర్ పావనీ వినయకుమార్



పరిశీలిస్తున్న గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనీ వినయకుమార్

**చిక్కడపల్లి, సెప్టెంబరు 28 ప్రభాతవార్త:**

త్వరలో గాంధీనగర్ డివిజన్‌లో రూ.21లక్షల వ్యయంతో సీవరేజ్ పైప్‌లైన్ వ్యవస్థను ఆధునీకరించబోతున్నట్లు స్థానిక కార్పొరేటర్ ఎ.పావనీ వినయకుమార్ అన్నారు. శనివారం డివిజన్‌లో బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.పావనీ వినయకుమార్, జలమండలి డిప్యూటీ జనరల్ మేనేజర్ కార్తీక్‌రెడ్డి, సిబ్బందితో కలిసి పాదయాత్ర నిర్వహించారు. రానున్న పండుగల నేపథ్యంలో ప్రజలకు అసౌకర్యం కలగకుండా పైప్‌లైన్ పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. స్థానికులు నూతన పైప్‌లైన్ ఏర్పాటుప్రక్రియపై ప్రజలు ఫిర్యాదు చేశారని, తాను ప్రత్యేకంగా చొరవ తీసుకుని పూర్తి కావస్తున్నాయన్నారు. కార్యక్రమంలో బిజెపి నేతలు శ్రీకాంత్, ఉమేశ్, ఆనంద్‌రావు, సాయికుమార్, జ్ఞానేశ్వర్, గౌతమి స్కూల్ ప్రిన్సిపాల్ గోపాలకృష్ణ, బస్తీవాసులు కృష్ణనేత, వజ్రేశ్వర్, పెంటయ్య పాల్గొన్నారు.

## జెపి నడ్డాను కలిసిన పాతబస్తీ బిజెపి నాయకులు



బిజెపి జాతీయ అధ్యక్షులు జెపి నడ్డాను కలిసిన పాతబస్తీ బిజెపి నాయకుల

**చార్మినార్,సెప్టెంబరు 28 ప్రభాతవార్త :**

బిజెపి జాతీయ అధ్యక్షులు,కేంద్ర మంత్రి జెపి నడ్డాను శనివారం చార్మినార్ నియోజకవర్గం దారుషిఫా ప్రాంతానికి చెందిన రాష్ట్ర బిజెపి మాజీ అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీతో పాటు పలువురు బిజెపి నాయకులు కలిశారు.పాతబస్తీకి చెందిన బిజెపి నాయకులు బిజెపి జాతీయ అధ్యక్షులు నడ్డాకు పుష్ప గుచ్చాలు అందశారు.ఈ సందర్భంగా రాష్ట్ర బిజెపి మాజీ అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ మాట్లాడుతూ కేంద్రం లోని బిజెపి అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం పాటు పడుతున్నదని తెలిపారు.కార్యక్రమంలో పలువురు బిజెపి నాయకులు పాల్గొన్నారు

## దేశంలో 23వ భాషగా బధిరుల భాషను చేర్చాలి




కార్యక్రమంలో పాల్గొన్న డెవలప్‌మెంట్ సొసైటీ ఫర్ డీఫ్(డిఎస్‌డి) రాష్ట్ర అధ్యక్షుడు వల్లభనేని ప్రసాద్ తదితరులు

**చిక్కడపల్లి, సెప్టెంబరు 28 ప్రభాతవార్త:**

బధిరుల సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డెవలప్‌మెంట్ సొసైటీ ఫర్ డీఫ్(డిఎస్‌డి) రాష్ట్ర అధ్యక్షుడు వల్లభనేని ప్రసాద్ డిమాండ్ చేశారు. శనివారం బాగ్‌లింగంపల్లిలోని డిఎస్‌డి రాష్ట్ర కార్యాలయంలో అంతర్జాతీయ బధిరుల దినోత్సవ కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన వల్లభనేని ప్రసాద్ మాట్లాడుతూ సమాజంలో వినికిడి లోపం కలిగిన వారు తీవ్రంగా వివక్షకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యాభివృద్ధి కోసం సింగిల్ లాంగ్వేజ్ స్కూల్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. దేశంలో 22 భాషలున్నాయని, 23వ భాషగా బధిరుల భాషను చేర్చాలని కోరారు. కార్యక్రమంలో డిఎస్‌డి ఉపాధ్యక్షుడు కాటమోని వెంకటేశ్‌గౌడ్, ప్రేమ్‌కుమార్, సత్యనారాయణ,వాసుదేవరావు, సుక్కయ్య, కరీం, మునీష్ పాల్గొన్నారు.

## డిటెక్టివ్స్‌ను తలపిస్తున్న పూర్ణచందర్‌రావు నవలలు

-డా. కె.వి.రమణాచారి



నవలలను ఆవిష్కరిస్తున్న రమణాచారి, జయరాములు, సుబ్బారావు తదితర అతిథులు

**నాంపల్లి, సెప్టెంబరు 28 ప్రభాతవార్త :**

ప్రముఖ రచయిత వీర పూర్ణచందర్‌రావు రచించిన ద్వీపరాజ్యం, ధనలక్ష్మీ ఆహ్వానం నవలలు పరిశోధనాత్మక విషయాలతో డిటెక్టివ్ నవలను తలపిస్తున్నాయని తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు డా. కె.వి.రమణాచారి శనివారం ఉదయం రెడ్‌హిల్స్‌లోని తన క్యాంపు కార్యాలయంలో డా. బ్రాహ్మణపల్లి జయరాములు సభాధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని ఆ రెండు నవలలను ఆవిష్కరించి మాట్లాడుతూ అన్నారు. రచయిత సాహిత్యశైలిని ప్రశంసిస్తూ సమాకాలీన అంశాలతో పాఠకులను చైతన్యపరిచేలా రచనలను సాగించడాన్ని కొనియాడుతూ మున్ముందు ప్రజలకు ఉపయోగపడే మరెన్నో రచనలు చేయాలని ఆకాంక్షించారు. ప్రముఖ సాహితీ సాంస్కృతిక ఆధ్యాత్మిక సంస్థ కమలా కృష్ణ కళాకౌముది ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆత్మీయ అతిథిగా సాహితీకిరణం సంపాదకుడు పొత్తూరి సుబ్బారావు పాల్గొనగా ప్రముఖ కవయిత్రి పొత్తూరి జయలక్ష్మి నవలల పరిచయం చేయగా ప్రముఖ రచయిత్రి డా. గురజాడ శోభాపేరిందేవి సభాసమన్వయం కావించారు.

## ప్రతి వ్యక్తి శాంతి కోసం కృషి చేయాలి



కార్యక్రమంలో పాల్గొన్న మహంత్ శ్రీ అరుణ్ దాస్ జీ మహారాజ్

**చార్మినార్,సెప్టెంబరు 28 ప్రభాతవార్త :**

సమాజంలోని ప్రతీ వ్యక్తి శాంతి కోసం కృషి చేయాలని మహంత్ శ్రీ అరుణ్ దాస్ జీ మహారాజ్ అన్నారు.కుంభమేళ అగ్రవాల్ బంధు, అశోక్ ఫౌండేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో శనివారం పాతబస్తీ రికాబ్‌గంజ్‌లో జరిగిన అన్న దానం కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ తమ శక్తి కొలది దాన ధర్మాలు చేయాలని తెలిపా రు.కుంభమేళ అగ్రవాల్ బంధు ప్రతినిధులు ఫంకజ్ కుమార్ అగర్వాల్,అనూప్ అగర్వాల్,రాజ్ కుమార్ బట్టడ్,శ్రీనివాస్, నీరజ్,చౌహాన్‌లు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులను పరిశీలించిన మాజీ కార్పొరేటర్

**జీడిమెట్ల, సెప్టెంబర్ 28, ప్రభాతవార్త**

సుభాష్‌నగర్ డివిజన్ పరిధిలో సుమారు 30 లక్షల వ్యయంతో చేపడుతున్న పనులను స్థానికులతో కలిసి మాజీ కార్పొరేటర్ సురేష్‌రెడ్డి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు నేను ఎల్లప్పుడు అందుబాటులో ఉండి వారికి అవసరమైన సదుపాయాలు, అభివృద్ధి పనులు చేస్తానని అన్నారు. కార్పొరేటర్, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ సహకారంతో భవాని నగర్ గ్రౌండ్‌లో సుమారు 20లక్షల వ్యయంతో ఓపెన్ జిమ్, కిడ్స్ ప్లే ఎక్యూప్‌మెంట్స్, సూరారం కాలనీ గ్రౌండ్‌లో సుమారు 15 లక్షలతో కిడ్స్ ప్లే ఏరియా పరికరాలు ఏర్పాటు కొరకు కార్పొరేటర్ హేమలత సురేష్‌రెడ్డి నిధులు మంజూచు చేయించారని తెలిపారు. పనులు ప్రారంభమైన సందర్భంగా పరిశీలించడం జరిగిందన్నారు.

